క్లుప్తంగా

నేడు ఖమ్మంలో 'ఆనంద లహరి'

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం ఆనందలహరి పేరిట నృత్య, గాన, హాస్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు మొగిలి ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రతినిధి మొగిలి గుణకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల కళాకారులు, సినీ, టీవీ నటులు పాల్గొని ప్రదర్శనలు ఇస్తారని పేర్కొన్నారు. లైవ్ ఆర్కెస్ట్రాతో జరిగే ఈ ప్రదర్శనలు సాయంత్రం ఆరు గంటలకు ప్రారంభమవుతాయని, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



మృతదేహం వద్ద అన్నం ఫౌండేషన్ సభ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల ఖమ్మం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లో గుర్తు తెలియని ఓ వృద్ధుడు (70) మృతి చెందగా.. మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో భద్రపరిచారు. మృతదేహం కోసం ఎవరూ రాకపోవడంతో పోలీసులు అనాథ మృతదేహంగా భావించి పోలీసులు, వైద్యశాల సిబ్బంది సమక్షంలో అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. ఈమేరకు నగరంలోని బల్లేపల్లి వైకుంఠధామానికి తరలించి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం అమరేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై అధికారుల పరిశీలన

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు ఆయకట్టును చుట్టుపక్కల ఉన్న గ్రామాలకు చెందిన పలువురు ఆక్రమణ చేస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఇరిగేషన్ డీఈఈ మన్మథరావు, ఏఈ నరేష్‌లు చెరువును పరిశీలించి ఆక్రమణ కట్టను తొలిగించాలని ఆదేశాలు జారీ చేశారు. సోమవారం నాటికి వేసిన కట్టలను తొలిగించకుంటే కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఈక్రమంలో చెరువుమాధారం చెరువు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఖాసిం, ఉపాధ్యక్షుడు దీరావత్ రాధాకృష్ణమూర్తిలు ఇరిగేషన్ అధికారులను కలిసి చెరువు ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో లష్కర్లు చట్టు వెంకటేశ్వర్లు, జి.వెంకటేశ్వర్లు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ



జనరల్ బోగీల ఉద్యమ ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జర్నలిస్టులకు హోమియో మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమాన్ని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ ప్రారంభించగా హోమియోపతి వైద్యుడు పి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ వడదెబ్బ బారిన పడకుండా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం అన్ని రైళ్లలో ఐదు జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో కోటి ఉత్తరాలు రాసే కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వనం వెంకటేశ్వర్లు, ఏనుగు వెంకటేశ్వరావుతో పాటు ఎస్.వెంకట్రావు, మైసా పాపారావు, చెరకుపల్లి శ్రీనివాసరావు, పురుషోత్తం, మేడి రమేష్, పి.సత్యనారాయణ, కల్యాణ్, మధులత తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	48	బచ్చలికూర	4
వంకాయ	36		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	90		20
కాకర	46	చుక్కకూర	3
బీర	58		20
దొండ	30	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	110	గోంగూర	4
గోరుచిక్కుడు	48		20
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	24		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	54		30
క్యారెట్	50	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం

పార్కింగ్.. ఇష్టారాజ్యం!

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పార్కింగ్ అస్తవ్యస్తంగా తయారైంది. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ఎక్కడ పడితే అక్కడ తమ వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ఆస్పత్రి ఆవరణ అంతా గందరగోళంగా తయారవుతోంది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పాటు పార్కింగ్ నిర్వహణను దివ్యాంగుల గ్రూపునకు ఇవ్వడంతో వారిని వాహనదారులు పట్టించుకోవట్లేదు. వారు వారిస్తున్నా.. లెక్కచేయకుండా ఇష్టమొచ్చిన చోట పార్క్ చేస్తున్నారు. దీంతో ఆవరణ అంతా వాహనాలతో దర్శనమిస్తోంది.



పెద్దాస్పత్రిలో అస్తవ్యస్తంగా పార్కింగ్



ప్రకృతి వనంలో పార్క్ చేసిన వాహనాలు

పెద్దాస్పత్రిలో పార్కింగ్ లేక అవస్థలు

- నచ్చిన చోట పార్క్ చేస్తున్న వాహనదారులు
- గందరగోళంగా తయారవుతున్న ఆస్పత్రి ఆవరణ
- ఇబ్బందులు పడుతున్న బాధితులు
- పర్యవేక్షించే వారు కరువు
- ప్రత్యేక స్థలం లేకనే తిప్పలు

ఖమ్మంవైద్యవిభాగం: పెద్దాస్పత్రికి నిత్యం వేలాది మంది రోగులు, వారి సహాయకులు వస్తుంటారు. ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, కార్లతో నిత్యం రద్దీగా ఉంటోంది. దీనికి తోడు అంబులెన్సులు, 102,108 వాహనాలు తిరుగుతుంటాయి. ఒక్కోసారి అస్తవ్యస్తమైన పార్కింగ్ వల్ల వాహనాల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడుతోంది. అంతేకాకుండా వాహనదారుల మధ్య తరచూ వాగ్వాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి.

ఏళ్లుగా ఇదే పరిస్థితి..

పెద్దాస్పత్రిలో పార్కింగ్ సమస్య చాలా ఏళ్లుగా వేదిస్తోంది. సరైన విధానం లేకపోవడంతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించట్లేదు. పార్కింగ్ నిర్వహణ బాధ్యతలను స్తంభాద్రి పట్టణ దివ్యాంగుల సమాఖ్యకు అప్పగించారు. ఈ గ్రూపుకు చెందిన 10 మంది దివ్యాంగులు వాహనదారుల వద్ద నుంచి రుసుము వసూలు చేస్తుంటారు. అయితే అందరూ దివ్యాంగులు కావడంతో వారి పట్ల వాహనదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. తమకు నచ్చిన చోట పార్కింగ్ చేస్తున్నారు. దీంతో పార్కింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా దర్శనమిస్తోంది. ఒక్కోసారి వాహనాలు ఒకదాని ఒకటి పడి గొడవలకు కారణం అవుతోంది. అంతే కాకుండా వాహనదారులు ఆస్పత్రిలోని ప్రకృతి వనంలో కూడా పార్క్ చేస్తుండడంతో అందులోని కొన్ని మొక్కలు వాహనాలతో తొక్కించబడి విరగిపోయి నిర్జీవంగా తయారవుతున్నాయి.

ప్రత్యేక స్థలం కరువు..

సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో పెద్దాస్పత్రి నిర్మించబడి ఉంటుంది. అయితే ఇంతటి విస్తీర్ణంలో ప్రత్యేక పార్కింగ్ స్థలం లేకపోవడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. ఆస్పత్రి ప్రారంభంలో ఏర్పాటు చేసిన చిన్నపాటి పార్కింగ్ ఉన్నా.. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో అది ఏమాత్రం సరిపోదు. దీంతో ఆస్పత్రిలో ఎక్కడ పడితే అక్కడ వాహనాలను పార్క్ చేస్తున్నారు. ముఖ్యంగా మాతా,శిశు ఆరోగ్య కేంద్రం, టీబీ ఆస్పత్రి, ట్రామా కేర్ సెంటర్, ల్యాబ్, ఆస్పత్రి కార్యాలయం, జనరల్ ఆస్పత్రి ఎదుట పార్కింగ్ చేసే వాహనాలతో రోజూ రద్దీగా ఉంటోంది. దీనికి తోడు విచ్చల విడిగా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతుండడంతో కొందరు వాహన దొంగలకు తస్కరించడానికి సులువవుతోంది. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఆస్పత్రిలో ప్రత్యేకంగా వాహన పార్కింగ్‌కు స్థలం కేటాయిస్తే గానీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలాలేదు.

శాశ్వత పరిష్కారం చూస్తాం..



పెద్దాస్పత్రిలో పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూస్తాం. త్వరలో టెండర్ పిలుస్తాం. ఇకపై ప్రత్యేక నిబంధనల ప్రకారం పార్కింగ్ నిర్వహణ ఉంటుంది. అందుకోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించేందుకు చర్యలు తీసుకుని పార్కింగ్ అంతా ఒకే దగ్గర ఉండేలా చూస్తాం. త్వరలో వాహనాల పార్కింగ్ సమస్య తీరేలా చేస్తాం.

– ఎల్.కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

అసలే కంపు.. అందులోనే డంపు..

- నిల్వ ఆహార పదార్థాలు డ్రైయినేజీల్లో
- అధికారుల తీరుపై విమర్శలు
- కేఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్



ఫ్రిడ్జ్‌లో నిల్వ ఉంచిన మాంసాన్ని డ్రైయినేజీలో పడవేయిస్తున్న అధికారులు



డ్రైయినేజీలో పడేసిన మాంసం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంనగరంలోని హోటళ్లను తనిఖీ చేసేందుకు వచ్చిన అధికారుల తీరుపై నగర వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిల్వ చేసిన ఆహార పదార్థాలను డ్రైయినేజీల్లో పోయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓ హోటల్‌లో వండిన మాంసాన్ని ఫ్రిడ్జ్‌లో నిల్వ చేయడాన్ని గుర్తించిన ఫుడ్ సెఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం ఆ మాంసాన్ని హోటల్ బయట ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ డ్రైయినేజీలో పడవేయించారు. ఇప్పటికే ఆ డ్రైయినేజీ నుంచి దుర్వాసన వస్తుండగా.. ఇప్పుడు అధికారులు కుళ్లిన మాంసాన్ని పోయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కుళ్లిన, పాడైన ఆహారాన్ని ఒక కవర్‌లో ఉంచి కేఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి అందజేస్తే డంపింగ్‌యార్డ్‌కు తరలిస్తుంటారు. అటువంటిది హోటల్ నిర్వాహకులు డ్రైయినేజీల్లో మిగిలిన ఆహారాన్ని వదిలి సమస్య సృష్టిస్తుంటే, అధికారులు అదే తీరును వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

ఖమ్మంమయూరిసెంటర్: పాఠశాల ఫీజుల నియంత్రణకు క్రమబద్ధమైన విధానాన్ని తీసుకురావాలని, అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలా చూడడం లక్ష్యంగా పాఠశాల ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఆదివారం స్థానిక మంచికంటి భవనంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ అధ్యక్షతన రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం–ఆవశ్యకత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ప్రతీ ఏడాది ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజుల పెంచుతున్నారని, అడ్మిషన్ కోసం వెళ్లిన తల్లిదండ్రులను ఫీజులు చూస్తే దిమ్మతిరుగుతుందన్నారు. ప్రొఫెషనల్ కోర్సులకు సంబంధించి తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజు రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్‌సీ) తరహాలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పర్యవేక్షణ, నియంత్రణ కమిటీ వేయాలన్నారు. అతర్వాత రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రణలో ఉండేట్లు విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మస్తాన్, ఐద్వా జిల్లా కార్యదర్శి మాచర్ల భారతిలు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మెరుగు రమణ, రాజు, సరళ, సంగీత, సాయిశేషు, నాగరాజు, శివ, రామకృష్ణ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

భగీరథ పేరుతో సీసీ రోడ్ల ధ్వంసం..!



ఇంటింటికి నల్లా నీరు అందించాలనే లక్ష్యంతో నగరంలోని పలు కాలనీల్లో మిషన్ భగీరథ పేరుతో రూ.లక్షలు ఖర్చు చేసి వేసిన సీసీ రోడ్లు ధ్వంసమవుతున్నాయన్నాయి. నగరంలోని 3వ డివిజన్ బాలపేట పాఠశాల ఎదురుగా మిషన్ భగీరథ పేరుతో సీసీ రోడ్డు తవ్వకాలు చేశారు కానీ మరమ్మతులు చేయకుండా మరిచారు. దీంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నీరు వచ్చేదోమో గాని సక్రమంగా ఉన్న రోడ్లను తవ్వి ఇలా ధ్వంసం చేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. - ఖమ్మంఅర్బన్

తీన్మార్ మల్లన్నను గెలిపించండి

ఖమ్మంమయూరిసెంటర్: పట్టభద్రుల స్థానానికి నేడు(సోమవారం) జరిగే ఉప ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, టీజేఎస్‌లను బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ ఉద్యోగ, నిరుద్యోగులను తన పదేళ్ల కాలంలో పట్టించుకోలేదని, కార్పొరేట్ల సేవలోనే తరించిందన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పన రంగాలపై దృష్టి సారించలేదని ప్రసాద్ తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులను పూర్తిగా విస్మరించిందని, ప్రభుత్వ ఉద్యోగులను సైతం పట్టించుకోలేదన్నారు. లీకులతోనే బీఆర్ఎస్ కాలం గడిచిపోయిందని ఇప్పుడు మరల ఆ రెండు పార్టీలకు ఓట్లు వేసినా ఫలితం లేదన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తొలి ప్రాధాన్యత ఓటిసి గెలిపించాలని ఆయన కోరారు.

బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

నేలకొండపల్లి: ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విజయం ఖాయమని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ మోసపూరిత మాటలను నమ్మొద్దని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ వర్గానికి ప్రయోజనం చేకూరలేదని, మీ భవిష్యత్‌ను మార్చేందుకు బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గోవిందరావు, నాగేశ్వరరావు, కృష్ణారావు, సతీష్, గిరి తదితరులు పాల్గొన్నారు.

స్లాబ్ సెంట్రింగ్ ఊడి తీవ్రగాయాలు

నేలకొండపల్లి: స్లాబ్ సెంట్రింగ్ తీస్తుండుగా ప్రమాదవశాత్తు ఊడిపడి ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బోదులబండలో షేక్ పాషా ఇంట్లో ఇటీవల నిర్మించిన బాత్‌రూమ్ స్లాబ్ సెంట్రింగ్‌ను ఆదివారం తీస్తుండగా ప్రమాదవశాత్తు ఊడిపడి షేక్ ఖాజాసుల్తాన్‌పాషా, దస్తగిరిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి ఆపై ఖమ్మం తరలించారు.

పట్టభద్రుల ఎన్నికకు.. | పకడ్బందీ ఏర్పాట్లు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది
- నేడు ఎమ్మెల్సీ ఎన్నిక



కూసుమంచి పోలింగ్ కేంద్రంలో సామగ్రితో సిబ్బంది

కూసుమంచి: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల స్థానానికి నేడు(సోమవారం) జరిగే ఉప ఎన్నికకు మండల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలో మొత్తం 3,036 మంది ఓటు హక్కును కలిగి ఉండగా కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనేపథ్యాన కూసుమంచిలోని పోలింగ్ కేంద్రాలను జెడ్పీ సీఈఓ వినోద్ పరిశీలించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

కామేపల్లిలో..



కామేపల్లి: సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఎన్నికల సిబ్బంది

కామేపల్లి: కామేపల్లి హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని, నీడ, తాగు నీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఆర్ఐ సక్రు, కార్యదర్శి అనిల్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, మండలంలో 2,071 మంది పట్టభద్రులు ఉన్నట్లు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

నేలకొండపల్లిలో..



నేలకొండపల్లి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జెడ్పీ సీఈఓ వినోద్

నేలకొండపల్లి: నేలకొండపల్లి పోలింగ్ కేంద్రాన్ని జెడ్పీ సీఈఓ వినోద్ ఆదివారం సందర్శించి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో మొత్తం 3,081 ఓటర్లకు గాను నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా పోలింగ్ కేంద్రాలను జెడ్పీసీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెంలో..



తిరుమలాయపాలెంలో ఏర్పాట్లు ఇలా..

తిరుమలాయపాలెం: మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో 2,468 మంది ఓటర్లు ఉండగా.. తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు 7 గురు అధికారులను నియమించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల తహసీల్దార్ పి.వి రామకృష్ణ తెలిపారు.

ఖమ్మం రూరల్‌లో..

ఖమ్మంరూరల్: నేడు జరగనున్న గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ ఎన్నికల్లో భాగంగా రూరల్ మండలంలో మొత్తం 7,177 మంది గ్రాడ్యుయేట్లు ఉండగా.. జలగంనగర్, నాయుడుపేటలలో గల 295 నుంచి 300 వరకు గల పోలింగ్ కేంద్రాలలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇందులో 4,170 మంది పురుషులు, 3,007మంది మహిళా ఓటర్లున్నారు.

ఆలయాల్లో ఘనంగా సంకట హర చతుర్థి



ఇందిరానగర్ బాలగణపతి ఆలయం వద్ద అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తజనం



మధురానగర్‌లో యాగం చేస్తున్న భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని పలు ఆలయాల్లో ఆదివారం సాయంత్రం సంకట హర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందిరానగర్ జంక్షన్‌లోని బాలగణపతి ఆలయంలో ప్రధాన అర్చకుడు గిరి ఆధ్వర్యాన ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు బాజిన్ని వీరయ్య, తిరుపతిరావు పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే, మధురానగర్ సాయిబాబా ఆలయంలోని గణపతి స్వామికి విశేష అభిషేక పూజలు, లక్ష్మీగణపతి హోమం, చండీయాగం పూజలు నిర్వహించారు.

మాదిగల అభివృద్ధే ఏకైక లక్ష్యం



అభివాదం చేస్తున్న మాదిగ జేఏసీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: మాదిగ, మాదిగ ఉపకులాల అభివృద్ధే తమ ఏకైక లక్ష్యమని మాదిగ జేఏసీ రాష్ట్ర నాయకుడు పోకల కిరణ్ మాదిగ అన్నారు. ఆదివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత 30 ఏళ్లుగా సాధించుకున్న మాదిగల హక్కులను కాపాడుకుంటూ అభివృద్ధి చెందేలా కొత్తగా ఏర్పడే ప్రభుత్వాలతో కలిసి మాదిగల మహాకూటమి ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఉమ్మడి ఖమ్మం జిల్లా పది నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు తెలిపారు. ఖమ్మం, మధిర మట్టి గురుమూర్తి, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట నకిరికంటి సంజీవరావు, భద్రాచలం, పినపాక, కొత్తగూడెం గొడ్ల మోహన్‌రావు, పాలేరు, ఇల్లెందు కొమ్ము ప్రసాద్‌లను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అంజన్న గౌడ్, శ్రీనివాస్, జిల్లా నాయకులు జొన్నల గడ్డ రామకృష్ణ, గోపి, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వేసవి దుక్కులు..

ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు దుక్కులు సిద్ధం చేస్తూ బిజీబీజీగా ఉన్నారు. జూన్‌లో పత్తి విత్తనాలు విత్తేందుకు రైతులు దుక్కులలో ఉన్న పత్తి, మిర్చి కట్టెను తొలగించి,ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు మట్టిని పంట పొలాల్లోకి తోలుకుని మట్టిని చదును చేస్తూ దుక్కులు దున్నుతున్నారు. మండలంలో గత ఏడాది మిర్చి పంటను సాగు చేసి నష్టపోయిన రైతులు ఈ ఏడాది మిర్చి పంటను తగ్గించి పత్తి సాగు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఎక్కడ చూసినా ట్రాక్టర్లతో దుక్కులు సిద్ధం చేస్తుండగా.. జూన్ మాసంలో పత్తి పంటకు అనువుగా వర్షాలు కురవాలనే ఆశతో రైతులు సన్నద్ధం అవుతున్నారు. – తిరుమలాయపాలెం



ఎదుళ్లచెరువులో ట్రాక్టర్‌తో లోతు దుక్కులు చేస్తున్న దృశ్యం